పచ్చిరొట్టతో ప్రయోజనాలెన్నో..

- భూసారం పెరుగుదల
- రసాయనాలు, చీడపీడల ఉధృతికి చెక్
- సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేస్తున్న ప్రభుత్వం



పసుపల్లిలో పచ్చిరొట్ట పైరుగా వేసిన జీలుగ పంట

అంబాజీపేట: రబీ వరికోతలు పూర్తవగానే మూడో పంటగా పలువురు రైతులు అపరాల పంట పండిస్తుంటే మరికొందరు రైతులు పచ్చిరొట్టను సాగు చేపట్టారు. ఎక్కడ చూసినా విచక్షణా రహితంగా రసాయన ఎరువుల వాడకం పెరిగిపోతుంది. రసాయన ఎరువుల అధిక వినియోగం, పంటల మార్పిడి విధానాన్ని పాటించకపోవడం వలన భూసారం కోల్పోతున్న విషయాన్ని రైతులు గుర్తించడం లేదు. గతంలో రైతులు భూసారం పెరగడానికి పచ్చిరొట్ట పైర్లను రబీ పంటల అనంతరం వేసేవారు. ఇటీవల కాలంలో పచ్చిరొట్ట పైరుల పెంపకం తగ్గిపోయింది. దీని వలన భూసారం తగ్గి పంటలు తెగుళ్ల బారిన పడుతున్నాయి. రైతులు తెగుళ్లను అరికట్టడానికి విచ్చలవిడిగా రసాయనాలను పిచికారీ చేసి అనర్థాలను కొనితెచ్చుకుంటున్నారు. రబీకి ఖరీఫ్‌కు మధ్యలో పచ్చిరొట్ట పైర్లను పెంచడం వలన భూసారం బాగా పెరుగుతుంది. పి.గన్నవరం నియోజకవర్గంలో 600, కొత్తపేట నియోజకవర్గంలో 750, రాజోలులో 976 ఎకరాల్లో జీలుగు, పిల్లిపెసర, జనుము సాగు చేపట్టారు.

స్థూల పోషకాలు అధికం

జనుము, జీలుగ, పిల్లిపెసర, ఉలవ, నీలి తదితర రకాలను ఖరీఫ్, రబీకి మధ్య సాగు చేసుకోవాలి. వీటిని పూత దశ వరకు పెంచి ఖరీఫ్‌లో భూమిలో కలియదున్నాలి. పచ్చిరొట్ట పైర్లలో స్థూల పోషకాలు అధికంగా ఉంటాయి. నత్రజని 1.8 శాతం నుంచి 3.5 శాతం వరకు ఉంటుంది. భాస్వరం 0.1 శాతం నుంచి 0.3 శాతం, పొటాషియం 0.5 నుంచి 2 శాతం వరకు ఉంటాయి. స్థూల పోషకాలతో పాటు సూక్ష్మ పోషకాలు కూడా భూమికి లభిస్తాయి. పంటల ఎదుగుదలకు ఈ మూడు పోషకాలు ఎంతో అవసరం. అలాగే నేలలు సంపూర్ణమై ఉత్పాదకత పెరుగుతుంది. భూమి లోపల నిక్షిప్తమైన పోషకాలను ఈ పైర్లు వెలికి తీస్తాయి. ఈ పైర్ల సాగు వలన 30 శాతం రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుంది. గుళికలను అధికంగా వాడడం వలన భూమి లోపల సూక్ష్మజీవులు నశించిపోతున్నాయి. పంటల పెరుగుదలకు ఉపయోగమైన సూక్ష్మజీవులు నశించడం వలన దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. పచ్చిరొట్ట పైర్లను భూమిలో కలియదున్నడం వలన తిరిగి సూక్ష్మజీవులు అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

సద్వినియోగం చేసుకోవాలి



రాబోయే తరాలకు భూమిని సారవంతంగా ఉంచాలంటే పచ్చిరొట్ట ఎరువులు వేయాలి. ప్రధాన ఎరువులకు చేసే ఖర్చును తగ్గించుకుని, నికర లాభం పొందడానికి వీలవుతుంది. ప్రభుత్వం 50 శాతం సబ్సిడీపై ఇచ్చే పచ్చిరొట్ట విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి.

– సీహెచ్‌డీ విజయ్‌కుమార్, ఏవో, అంబాజీపేట

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



చింతలమోరిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు

మలికిపురం: మండలంలోని చింతలమోరిలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు సోమవారం రాజోలు ఎమ్మెల్యే రాపాక వర ప్రసాదరావు భూమి పూజ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. ప్రభుత్వం నిర్వహించిన గడప గడపకూ కార్యక్రమంలో అనేక సమస్యలు గుర్తించి ప్రభుత్వం పరిష్కరిస్తున్నట్లు ఎమ్మెల్యే అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రమేష్ బాబు, ఎంపీటీసీ తోటి రాజేష్, కార్యదర్శి డీఎల్ సునీత, బోనం వెంకట రామారావు, కొల్లాబత్తుల అశోక్‌కుమార్, నల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుకు దరఖాస్తు స్వీకరణ

ఆలమూరు: మండలంలోని పెదపళ్ల-3 లోని అంగన్‌వాడీ కేంద్రంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త పోస్టుకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కపిలేశ్వరపురం ఐసీడీఎస్ సీడీపీఓ‌ఓ అధికారి గజలక్ష్మి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఈ పోస్టును ఓసీ (హెచ్ హెచ్) ప్రభుత్వం కేటాయించిందన్నారు. వినికిడి లోపం ఉన్న పదో తరగతి ఉత్తీర్ణులైన మహిళలు ఈనెల 16 లోపు కపిలేశ్వరపురం సీడీపీఓ కార్యాలయానికి దరఖాస్తులను అందజేయాలన్నారు. ఇతర వివరాలకు సమీప అంగన్‌వాడీ కేంద్రాలను సంప్రదించాలని సీడీపీఓ విజ్ఞప్తి చేశారు.

సూర్యనారాయణరెడ్డి సేవలు ఎనలేనివి



ఎమ్మెస్సార్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి తదితరులు

రావులపాలెం: 25 ఏళ్ల పాటు ఊబలంక సర్పంచ్‌గా సేవలందించిన మేడపాటి సూర్యనారాయణరెడ్డి (ఎమ్మెస్సార్) సేవలు ఎనలేనివని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, రుడా చైర్‌పర్సన్ మేడపాటి షర్మిలారెడ్డిలు అన్నారు. సోమవారం గ్రామంలో పంచాయతీ ఎదురుగా నూతనంగా నిర్మించిన ఎమ్మెస్సార్ విగ్రహాన్ని వారు ఆవిష్కరించారు. సర్పంచ్ కొక్కిరగెడ్డ లక్ష్మి అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో ఎమ్మెస్సార్ ఒక ప్రత్యేక ముద్ర వేశారని క్లాస్ వన్ కాంట్రాక్టర్ కావడంతో గ్రామంతో పాటు కొత్తపేట నియోజకవర్గంలో ఆయన అభివృద్ధికి బాటలు వేసేలా వంతెనలు నిర్మించారని ఆయన సేవలను కొనియాడారు. అయన విగ్రహం ఆవిష్కరించడం నేటి తరానికి ఆయన గొప్పదనాన్ని తెలియజేస్తుందన్నారు. అనంతరం నాటి పంచాయతీ పాలకవర్గంలో ఉన్న సభ్యులకు గ్రామంలో వివిధ సంఘాల పెద్దలను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొవ్వూరి దుర్గారెడ్డి, మేడపాటి సత్రెడ్డి, మేడపాటి శ్రీనివాసరెడ్డి, నల్లమిల్లి సూర్యనారాయణరెడ్డి, నల్లమిల్లి సుబ్బారెడ్డి, బాలు, కొక్కిరగెడ్డ అబ్బులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రణాళికతో ముందుకు సాగాలి



సివిల్స్ ర్యాంకర్ లక్ష్మీరమణిని అభినందిస్తున్న శ్రీనివాస్

మామిడికుదురు: ఒక ప్రణాళిక ప్రకారం చదువుకుని అనుకున్న లక్ష్యాలను చేరుకోవాలని సివిల్స్ ర్యాంకర్ యర్రంశెట్టి ఉమాశ్రీలక్ష్మీరమణి పేర్కొన్నారు. రాజోలు నియోజకవర్గ రైతు అధ్యక్షుడు యాలి శ్రీనివాస్ సివిల్స్ ర్యాంకర్ రమణిని సోమవారం కలసి ఆమెకు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు. హైదరాబాద్‌లో శ్రీచైతన్య ఐఏఎస్ అకాడమీలో ఐఏఎస్ శిక్షణ పొందుతున్న అమలాపురానికి చెందిన రాయుడు దేవిసత్యరేష్మ కూడా రమణిని కలిసింది. రేష్మకు ఈ సందర్భంగా రమణి పలు సూచనలు, సలహాలు అందించారు. తాను ఏవిధంగా సివిల్స్‌లో అనుకున్న లక్ష్యాలను చేరుకుందో వివరించారు. అప్పారి వెంకటేశ్వరరావు, రాయుడు మాధవి, యర్రంశెట్టి రామారావు కూడా రమణిని అభినందించారు.

దివ్యాంగులకు ఎన్‌ఆర్‌ఐ చేయూత

అంబాజీపేట: నిరుపేద దివ్యాంగులకు యూఏఈ (యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్) జనసేన అధ్యక్షుడు, ఎన్‌ఆర్‌ఐ పెనుమాల జాన్‌బాబు చేయూత నందించారు. ఇరుసుమండ శివారు జగన్నతోట కాలనీలో ఉన్న దివ్యాంగులు చిల్లే అంబేడ్కర్, బేబి దంపతులకు చెందిన ఇల్లు శ్లాబ్ వేసి అసంపూర్తిగా ఉండటంతో తోట శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సోమవారం ఇంటి పనులు చేపట్టారు. ఎన్‌ఆర్‌ఐ జాన్‌బాబు అందించిన రూ.2 లక్షలతో ఇంటి నిర్మాణ పనులు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో తోట బాబి, మంచాల నోకేష్, యర్రంశెట్టి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కంప్యూటర్‌పై అవగాహన కలిగి ఉండాలి



విద్యార్థులకు కంప్యూటర్‌పై అవగాహన కల్పిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు

అంబాజీపేట: ప్రస్తుత కాలంలో ప్రతి విద్యార్థి కంప్యూటర్‌పై పూర్తి అవగాహన కలిగి ఉండి సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో బైర్రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచిత కంప్యూటర్ శిక్షణను హెచ్‌ఎం బీర హనుమంతరావు ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు. ఎంపీపీ మాట్లాడుతూ బైర్రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ట్యాబ్‌లపై శిక్షణ ఇస్తారని దానిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కంప్యూటర్ ట్రైనర్ బి.శ్రీనివాస్ విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఉపాధ్యాయులు వెన్నపు సత్యనారాయణ, స్థానిక నాయకులు మైలా ఆనందరావు, నాగాబత్తుల సుబ్బారావు, కొర్లపాటి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలు, యూనిఫారం సిద్ధం

అంబాజీపేట: ఈ నెల 12న పునః ప్రారంభిస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు అవసరమైన పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసిందని ఎంఈఓ జేవీ కనకదుర్గ తెలిపారు. అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో పాఠ్యపుస్తకాలను హెచ్‌ఎం బీర హనుమంతరావు సోమవారం పర్యవేక్షించి పాఠశాలల వారీగా పంపిణీ చేసేందుకు ఏర్పాటు చేస్తున్నారు. మండలంలో 9 జెడ్పీ హైస్కూళ్లు, 54 ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలు ఉన్నాయని వీటిలో 4,296 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. మండలంలో 39 పాఠ్యపుస్తకాలు అవసరమై ఉండగా రెండు విడతలుగా 27 వేల పాఠ్యపుస్తకాలు వచ్చాయన్నారు. మిగిలిన పాఠ్యపుస్తకాలు వారం రోజుల్లోగా రానున్నాయన్నారు. అలాగే పాఠశాల తెరిచే సమయానికి విద్యార్థులకు అవసరమైన యూనిఫారం, స్కూల్ బ్యాగ్, బెల్ట్, షూలు, నోటు పుస్తకాలు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు.

టిప్పర్లను అదుపు చేయాలి

మామిడికుదురు: ఇసుక ట్రాక్టర్లు, టిప్పర్ల రాకపోకలతో ఆర్‌అండ్‌బీ రోడ్డు పాడైపోతుందని వీటిని అదుపు చేయాలని కోరుతూ మొగలికుదురు చేనేత కాలనీ వాసులు సోమవారం స్పందనలో తహసీల్దార్ సీహెచ్ నాగలక్ష్మమ్మకు వినతిపత్రం ఇచ్చారు. రెండేళ్ల క్రితం మొగలికుదురు నుంచి పాలగుమ్మి వరకు బ్లాక్‌టాప్ రోడ్డు నిర్మించారని చెప్పారు. ఆ మార్గంలో ఎస్సీ, ఎస్టీ, చేనేత కాలనీ వాసులతో పాటు పాలగుమ్మి వాసులు రాకపోకలు సాగిస్తున్నారన్నారు. టిప్పర్లను, ట్రాక్టర్లను నిలుపుదల చేసేందుకు ప్రయత్నించగా మాకు ఉన్నతాధికారుల నుంచి అనుమతులు ఉన్నాయంటూ దురుసుగా ప్రవర్తిస్తున్నారని వాపోయారు. దీనిపై తక్షణం స్పందించి ఆ మార్గంలో భారీ వాహనాల రాకపోకలను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. స్పందనలో ఫిర్యాదు చేసిన వారిలో కె.పాండురంగ, జాన రాజేశ్వరరావు, బి.సూర్యసత్యనారాయణ, ఎన్.గణేష్ ఉన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే సీఎం లక్ష్యం

- తాడిపూడిలో గడప గడపకూ..
- గ్రామంలో 178 మందికి ఇళ్ల పట్టాల పంపిణీ
- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి



తాడిపూడిలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

ఆత్రేయపురం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిరంతరాయంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుందని ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆయన సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆత్రేయపురం మండలంలో తాడిపూడిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరిస్తుంటే అడుగడుగునా అవ్వాతాతలు ఆశీర్వాదాలు, ఆడపడుచుల అభిమానం, రైతన్నలు ఆనందంతో గ్రామంలో ప్రభుత్వ పనితీరును ప్రశంసించారు. సచివాలయ, సిబ్బంది, వలంటీర్లు బాగా పని చేస్తున్నారని పథకాలు చక్కగా అందుతున్నాయన్నారు. ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తరువాత తాడిపూడిలో వివిధ సంక్షేమ పథకాల ద్వారా బీసీ లబ్ధిదారులకు రూ.3.92 కోట్లు, ఎస్సీ లబ్ధిదారులకు రూ.1.71 కోట్లు, ఎస్టీ లబ్ధిదారులకు రూ.3.09 లక్షలు, కాపు లబ్ధిదారులకు రూ.1.40 కోట్లు, ఇతర సామాజిక వర్గాల లబ్ధిదారులకు రూ.2.39 కోట్లు కాగా మొత్తం రూ.9.46 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. గ్రామంలో 178 మంది లబ్ధిదారులకు మంజూరైన ఇళ్ల పట్టాలను పంపిణీ చేసి 88 మందికి ఇళ్ల స్థలాలను సంప్రదాయబద్ధంగా ఆడపడుచులకు కానుకగా పసుపు, కుంకుమ, జాకెట్టు, గాజులతో అందజేశారు. గ్రామ సర్పంచ్ ముదునూరి సుబ్బలక్ష్మి, ముదునూరి గణపతిరాజు, ఎంపీటీసీ కేతా వరలక్ష్మి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి గడప గడపకూ నిర్వహించి ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు వివరించారు. పెద్ద సంఖ్యలో మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, పార్టీ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ బోణం సాయిబాబు, పార్టీ నాయకులు చిలువూరి బాబీరాజు, కొల్లి శ్యాంసన్, పాలా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్ ప్రజల హృదయాల్లో నిలిచారు



పాశర్లపూడిలో గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: సంక్షేమ పథకాల అమలుతో లక్షలాది మంది ప్రజల హృదయాల్లో సీఎం జగన్ మోహన్‌రెడ్డి చిరస్థాయిగా నిలిచారని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం పాశర్లపూడిలో జరిగింది. దీనిలో భాగంగా ఎమ్మెల్యే చిట్టిబాబు ప్రతి ఇంటికి వెళ్లారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. వారిని అక్కున చేర్చుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. జనం మెచ్చిన నేతగా జగన్ ప్రజల మన్ననలు అందుకుంటూ రాష్ట్రాన్ని ప్రగతి బాటలో నడిపిస్తున్నారని చెప్పారు. మళ్లీ జగనన్న పాలన రావాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటున్నారని వచ్చే ఎన్నికల్లో మళ్లీ వైఎస్సార్ సీపీ విజయఢంకా మోగిస్తుందని ఎమ్మెల్యే చిట్టిబాబు ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, ఎంపీటీసీ అంకాని వీరాంజనేయులు, పీఎంసీ చైర్మన్ పిల్లి శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షుడు చిక్కం బుజ్జిబాబు, మాజీ సర్పంచ్ కొనుకు నాగరాజు, పార్టీ నాయకులు తోరం సూర్యభాస్కర్, వాసంశెట్టి రామకృష్ణ, మోకా విజయరాజు, గుండాబత్తుల గోవిందరావు, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు వెలకట్టలేం



ఆదుర్రులో వలంటీర్ల సన్మానంలో పాల్గొన్న ఎమ్మెల్యే చిట్టిబాబు

మామిడికుదురు: వలంటీర్లు అందిస్తున్న సేవలను వెలకట్టలేమని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేర్కొన్నారు. వలంటీర్లకు వందనంలో భాగంగా సోమవారం ఆదుర్రు, లూటుకుర్రు, మాకనపాలెం గ్రామాల్లో జరిగిన సమావేశాల్లో ఎమ్మెల్యే చిట్టిబాబు వలంటీర్లకు పురస్కారాలు అందించి వారిని సత్కరించారు. గోదావరి వరదలు, తుపానులు, కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో సైతం వలంటీర్లు తమ ప్రాణాలను ఫణంగా పెట్టి ప్రజలకు సేవలందించారని గుర్తు చేశారు. వారికి ఎంతిచ్చినా తక్కువే అవుతుందని, దీన్ని గుర్తించిన సీఎం జగన్ ఏటా వలంటీర్లకు పురస్కారాలు అందిస్తున్నారని చిట్టిబాబు చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని స్ఫూర్తిగా తీసుకుని మరిన్ని సేవలందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమాల్లో జెడ్పీటీసీ కొరెడ్డి అంజిబాబు, మండల జేసీఎస్ ఇన్‌చార్జ్ జక్కంపూడి వాసు, ఎంపీటీసీలు గెద్దం మహాలక్ష్మమ్మ, నామన వెంకటేశ్వరరావు, వలవల పెదబాబు, సర్పంచ్ మద్దాల బాబూరావు, పీఏసీఎస్ చైర్మన్ యూవీవీ సత్యనారాయణ, పార్టీ నేతలు తులా గోపాలకృష్ణ, పి.సురేంద్ర, కాండ్రేగుల బాబి, భూపతి దామోదరరావు, అడబాల చక్రపాణి, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు, అధికారులు పాల్గొన్నారు.

ఆందోళన కలిగిస్తున్న జాతీయ రహదారి



పాశర్లపూడిలో దిగబడిపోయిన జాతీయ రహదారి

మామిడికుదురు: పాశర్లపూడి కొండాలమ్మచింత సెంటర్ సమీపంలో బ్యాంక్ ఆఫ్ బరోడా సమీపంలో 216వ నంబర్ జాతీయ రహదారి ప్రమాదకరంగా మారింది. రహదారి మధ్యలో ఏర్పడిన పెద్ద గొయ్యి వాహనదారుల సహనానికి పరీక్షగా మారింది. జాతీయ రహదారి మధ్యలో దిగబడి పోవడంతో ఇక్కడ వన్ వే ట్రాఫిక్ తరహాలో వాహనాలు వెళ్తున్నాయి. చాలాకాలం నుంచి ఇక్కడ పరిస్థితి ఇదే విధంగా ఉన్నా దీన్ని పక్కాగా అభివృద్ధి చేయడం లేదని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు దిగబడిపోయిన ప్రాంతంలో జాతీయ రహదారుల విభాగం అధికారులు గతంలో తాత్కాలిక మరమ్మతులు చేసి చేతులు దులిపేసుకున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అయినా షరా! మామూలే అన్న విధంగా ఈ రోడ్డు పరిస్థితి అధ్వానంగా మారింది. జాతీయ రహదారి కావడంతో వాహనాలు అతి వేగంగా వెళ్లడం వల్ల ఇక్కడ ప్రమాదకర పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. రాత్రి సమయాల్లో పరిస్థితి మరింత భయానకంగా ఉంటుందని ఆవేదన చెందుతున్నారు. కనీసం ఇక్కడ ప్రమాదకర పరిస్థితిని సూచించే హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాశర్లపూడి కై కాలపేట నుంచి పాశర్లపూడిబాడవ వరకు అర కిలోమీటరు మేర 216వ నంబర్ జాతీయ రహదారి పరిస్థితి దారుణంగా ఉంది. ఈ రోడ్డు పరిస్థితిపై సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు దృష్టి సారించి పాడైపోయిన జాతీయ రహదారిని ఆధునీకరించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రయాణీకులు డిమాండ్ చేస్తున్నారు.

ఆకట్టుకుంటున్న నరేష్‌కుమార్ పెయింటింగ్



నరేష్‌కుమార్ రూపొందించిన గ్రామీణ మహిళ పెయింటింగ్



నరేష్‌కుమార్

ఆల్ ఇండియా ఆర్ట్ కాంపిటీషన్‌లో ప్రదర్శన

మామిడికుదురు: గ్రామీణ వాతావరణంలో స్త్రీ జీవన విధానాన్ని ప్రతిబింబించే విధంగా మామిడికుదురుకు చెందిన వేగిరౌతు నరేష్‌కుమార్ రూపొందించిన పెయింటింగ్ చూపరుల్ని విశేషంగా ఆకట్టుకుంటోంది. హైదరాబాదులోని మాదాపూర్ 'స్టేట్ గ్యాలరీ ఆఫ్ ఆర్ట్' ఏర్పాటు చేసిన 'ఆల్ ఇండియా ఆర్ట్ కాంపిటీషన్ – ఎగ్జిబిషన్'లో ఈ పెయింటింగ్ ప్రదర్శనకు అవకాశం దక్కింది. ఈ ఎగ్జిబిషన్ ఈ నెల 2వ తేదీన ప్రారంభమైంది. 10వ తేదీ వరకు కొనసాగుతుంది. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ప్రముఖ గ్యాలరీ ఆర్టిస్టులు తయారు చేసిన పెయింటింగ్స్‌ను ఇక్కడ ప్రదర్శిస్తున్నారు. కొన్నేళ్లుగా పెయింటర్‌గా రాణిస్తున్న నరేష్‌కుమార్ ఎంతో కష్టపడి ఈ పెయింటింగ్‌ను రూపొందించానని చెప్పారు. తాను పుట్టి పెరిగిన గ్రామీణ వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకుని, ఇక్కడి మహిళల సంప్రదాయ వేషధారణ, కట్టు, బొట్టు, నడక, నడవడిక, హుందాతనం ఉట్టిపట్టేలా ఈ పెయింటింగ్‌ను రూపొందించానని చెప్పారు. వందకు పైగా పెయింటింగ్స్ ప్రదర్శిస్తున్న ఎగ్జిబిషన్‌లో తాను రూపొందించిన పెయింటింగ్‌కు అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నానని నరేష్‌కుమార్ పేర్కొన్నారు.


వైభవంగా కనకదుర్గ విగ్రహ ప్రతిష్ఠ

పి.గన్నవరం: ముంజవరపుకొట్టులో నూతనంగా నిర్మించిన ఆలయంలో కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ సోమవారం ఘనంగా జరిగింది. కాసు శ్రీనివాసరావు, రత్నమాల దంపతులతో ఈ ప్రతిష్ఠా వైభవంగా నిర్వహించారు. హైదరాబాదులో స్థిరపడిన స్థానికుడు శ్రీనివాసరావు దంపతులు అందించిన నిధులతో నూతన ఆలయం నిర్మించారు. కొడమర్తి నరసింహశాస్త్రి బ్రహ్మత్వంలో శైవాగమానుసారం యాగ, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఆలయం వద్ద భారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబటి భూలక్ష్మి, సర్పంచ్ శృంగవరపు లక్ష్మణరావు, దేశిరాజు సీతారామయ్య, కొడమర్తి విశ్వనాథశాస్త్రి, మాజీ సర్పంచ్ నేలపూడి దుర్గారావు పాల్గొన్నారు.

లంకాలమ్మ జాతర

అంబాజీపేట: ముక్కామలలో వేంచేసిన గ్రామ దేవత లంకాలమ్మ అమ్మవారి జాతరను సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. జాతరలో ఏర్పాటు చేసిన గరగ నృత్యాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మంగళవారం అమ్మవారి జాతరను నిర్వహిస్తున్నామన్నారు. అలాగే తొండవరంలో వేంచేసియున్న రాజ్యలక్ష్మి అమ్మవారి తీర్థాన్ని మంగళవారం నిర్వహించనున్నారు. 10న జలకం జరుగుతుందని కమిటీ సభ్యులు తెలిపారు.

చిన్నారులను ప్రభుత్వ హాస్టళ్లలో చేర్పించండి



హాస్టళ్లలో చేరేందుకు అంగీకరించిన విద్యార్థులతో ఉపాధ్యాయుల బృందం

మామిడికుదురు: ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు ప్రభుత్వం నాణ్యమైన విద్యతో పాటు ఉన్నత సదుపాయాలు కల్పిస్తోందని, మీ చిన్నారులను ప్రభుత్వ వసతి గృహాల్లో చేర్పించాలని కోరుతూ మామిడికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుల బృందం సోమవారం ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ నిర్వహించింది. దీనిలో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలంలోని పెదమల్లాం, పెదమల్లాంలంక, అనగర్లంక గ్రామాల్లో పర్యటించింది. పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ నిరంజని ఆధ్వర్యంలో పై గ్రామాలకు చెందిన 18 మంది విద్యార్థుల నుంచి పాఠశాలలో చేరేందుకు అంగీకారం తెలిపారు. ఏటా పై మూడు గ్రామాలకు చెందిన విద్యార్థులు మామిడికుదురు బాలుర, బాలికల వసతి గృహాల్లో చదువుకుంటున్నారు. ఈ ఏడాది జరిగిన పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన పై గ్రామాలకు చెందిన చీకరమెల్లి శిరీష, బూసి ఫణికుమార్‌లు పాఠశాల స్థాయిలో ఇంగ్లిషులో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారు. ఈ విద్యార్థులతో పాటు వారి పేరెంట్స్‌ను సన్మానించారు. కార్యక్రమంలో స్టాఫ్ సెక్రటరీ సీహెచ్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

మలికిపురం: పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టీవీవీ సత్యనారాయణ అన్నారు. సోమవారం మలికిపురం డిగ్రీ కళాశాలలో ప్రపంచ పర్యావరణ దినోత్సవం ప్రిన్సిపాల్ అధ్యక్షతన జరిగింది. ప్రాంగణంలో చెత్త, ప్లాస్టిక్ వస్తువులు ఏరివేసే కార్యక్రమం లెక్చరర్స్, విద్యార్థులు చేపట్టారు. అలాగే వారు మొక్కలు నాటారు. విద్యార్థులకు పర్యావరణంపై డ్రాయింగ్, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో బోటనీ హెడ్ సీహెచ్ సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు పాల్గొన్నారు. అలాగే డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ సైకిల్ డే సందర్భంగా జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు.

కొత్తపేట: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్.అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన సదస్సు, మొక్కలు నాటే కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ కిషోర్‌బాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడాలని, ప్రకృతిని కాపాడితే అది మనల్ని రక్షిస్తుందన్నారు. అనంతరం సుమారు 250 మొక్కలు నాటారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మామిడికుదురు: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆక్సిజన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం పాశర్లపూడిలో మొక్కలు పంచారు. అసోషియేషన్ వ్యవస్థాపకుడు కటికిరెడ్డి గంగాధరం ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచాలని ఈ సందర్భంగా పలువురు సూచించారు. మొక్కల పెంపకంతో పర్యావరణ కాలుష్యాన్ని అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో మొల్లేటి తలుపులరాజా, కటికిరెడ్డి శివ, పేరాబత్తుల కార్తిక్ పాల్గొన్నారు.

పి.గన్నవరం: చెట్లను పెంచి పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బెల్లంపూడి సర్పంచ్ బండి మహాలక్ష్మి అన్నారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం సందర్భంగా బెల్లంపూడి గ్రామ సచివాలయం వద్ద సోమవారం ఆమె మొక్కలు నాటారు. విద్యుత్, నీటి వనరులను పొదుపుగా వినియోగించాలని, ప్లాస్టిక్ వస్తువును నిషేధించాలని ఆమె అన్నారు. మహాలక్ష్మి ఫౌండేషన్ ప్రతినిధి బండి రమేష్, డి.పద్మ, జి.నాగలక్ష్మి, డి.లోవకుమారి, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలమూరు: పర్యావరణ హితమే లక్ష్యంగా అందరూ తమ వంతు మొక్కల పెంపకానికి తగిన ప్రాధాన్యతను ఇవ్వాలని రావులపాలెంకు చెందిన పుల్లాన్ ఇండియా బృందం విజ్ఞప్తి చేసింది. మండలంలోని చింతలూరులో సోమవారం పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కోఆర్డినేటర్ ఎస్.రాంబాబు, పెదపళ్ల పీహెచ్‌సీ హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజాతో కలిసి స్థానికులకు మొక్కలను అందజేశారు.

రైలు ప్రమాద మృతులకు కొవ్వొత్తుల నివాళి

అంబాజీపేట: ఒడిశాలోని బాలాసోర్ జిల్లా బహనాగ వద్ద జరిగిన రైలు ప్రమాద మృతులకు ఆత్మశాంతి చేకూరాలని సోమవారం రాత్రి అంబాజీపేట నాలుగు రోడ్ల సెంటర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కోనసీమ వినియోగదారుల సమాఖ్య అధ్యక్షుడు అరిగెల బలరామమూర్తి, అఖిలపక్షం ఆధ్వర్యంలో మృతులకు సంతాపం తెలుపుతూ శ్రద్ధాంజలి ఘటించారు.

కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్, పి.గన్నవరం సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్సై ఎ.చైతన్యకుమార్, డీవీవీ సత్యనారాయణ, బొంతు పెదబాబు, గణపతి వీర రాఘవులు, రవణం రాము, శిరిగినీడి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం సీజ్

మామిడికుదురు: నగరం గ్రామంలో టాటా ఏస్ వాహనంపై అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని విజిలెన్స్ అధికారులు సోమవారం సీజ్ చేశారు. ఆ వాహనంలో 52 మూటల్లో రెండు మెట్రిక్ టన్నులు బియ్యం ఉన్నట్లు గుర్తించారు. రాజోలు మండలం ములికిపల్లికి చెందిన అడబాల సూర్యచంద్ర ఆదేశాల మేరకు సఖినేటిపల్లి మండలం మోరిపోడుకు చెందిన వాహన డ్రైవర్ చాట్ల నవీన్ ఈ బియ్యాన్ని తరలిస్తున్నాడని ఇన్‌చార్జ్ రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.కుమార్ తెలిపారు. ఈ బియ్యం విలువ రూ.3.80 లక్షలు ఉంటుందన్నారు. వాహనంతో పాటు అందులోని బియ్యాన్ని సీజ్ చేసి 6ఎ కేసు నమోదు చేశామన్నారు. సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని నగరం పోలీస్ స్టేషన్‌కు సిఫారసు చేశామన్నారు.

వసంతవాడ ఎత్తిపోతల పథకానికి నిధుల మంజూరు

ఆత్రేయపురం: మండల పరిధిలోని వసంతవాడ ఎత్తిపోతల పథకం అభివృద్ధి పనులకు జిల్లా కలెక్టర్ రూ.20 లక్షలు నిధులు విడుదల చేసినట్లు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆయన సోమవారం మండలంలోని వసంతవాడలో ఉన్న సోమసుందరరెడ్డి ఎత్తిపోతల పథకం అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఎత్తిపోతల పథకం మరమ్మతులకు గురైనట్లు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన స్పందించి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుని వెళ్లడంతో రూ.20 లక్షలు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అలాగే పేరవరం ఎత్తిపోతల పథకం మరమ్మతులు చేపట్టినట్లు తెలిపారు. వసంతవాడ సోమసుందరరెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా 2 వేల ఎకరాల సాగు అవుతుందన్నారు. సాగుకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ కనుమూరి శ్రీనివాసరాజు, జిల్లా పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ కప్పల శ్రీధర్, ఎంపీపీ కుండ అన్నపూర్ణ, జెడ్పీటీసీ బోణం సాయిబాబు, ఎత్తిపోతల పథకం కార్యదర్శి పాలా నాగేశ్వరరావు పాల్గొన్నారు.